# శ్రీ చక్ర పూజ

“స్వామీజీ ఆశ్రమంలో, స్వామీజీ స్థాపించిన ఆలయాలలో నిత్యం శ్రీచక్రపూజ జరుగుతుంది. ఆ శ్రీ చక్రం గురించి అందరికీ అర్థమయ్యేలా క్లుప్తంగా చెబుతారు. (శ్రీ స్వామీజీ ఎప్పుడూ ‘నేను’, ‘నా’,‘మా’ అని ప్రయోగించరు. ‘నేను’ అని చెప్పవలసిన చోట ‘స్వామీజీ’ అని చెబుతారు)

శ్రీచక్ర అధిష్ఠాన దేవత - శ్రీ లలిత. అయితే, ఆలయ దేవత ఎవరైనా శ్రీచక్ర స్థాపన ఆచారంగా వచ్చింది.

‘శ్రీచక్రం’ అంటే విశ్వం.

‘మంత్రము’ అంతే సూక్ష్మరూపిణియైన దేవతా స్వరూపం.

సాధనతో సాధకుని మంత్ర శక్తి పెరుగుతుంది.

యంత్రము, దేవి వేర్వేరు కాదు.

యంత్రము అంటే - కామాది వికారముచే కలిగే దోషాలను యంత్రణము చేయునది.

దేవి వర్ణమాలాధారిణి. వర్ణముల సంఖ్యను బట్టి మంత్రం వేర్వేరుగా వుంటుంది.

ఈ మంత్రాన్ని ఎవరికి వారు పుస్తకాలలో చూసి, వల్లెవేయరాదు. సద్గురువుని ప్రసన్నం చేసుకుని, సుముహూర్తాన వాని నుంచి ఉపదేశం పొందాలి. ఉచ్ఛారణ క్రమాన్ని పాటించాలి. నియమాల్ని ఆచరించాలి.‘శ్రీచక్రం’ ఒకే విధంగా వుంటుందని అనుకోరాదు. అది అయిదు రకాలు:

మేరు

సుమేరు

భూప్రస్తార

అర్థమేరు

మహామేరు

ఈ అయిదింటి తత్వం ఒకటే. కాకపోతే, వాటిమీద వుండే అక్షరాలు వేర్వేరు, కోణాలు వేర్వేరు.

‘శ్రీచక్రం’ అంటే కేవలం సంపత్తిని, జనాకర్షణని మాత్రమే ప్రసాదించేది కాదు. నివృత్తిని, ప్రవృత్తిని- రెంటినీ ప్రసాదిస్తుంది.

నివృత్తి అంటే వైరాగ్యం ఏర్పడి భగవత్తత్వాన్ని ప్రసాదించేది.
ప్రవృత్తి అంటే ఆరోగ్యాన్ని, సంపత్తిని, వంశాభివృద్ధిని ప్రసాదించేది.

స్వామీజీ పై అయిదింటికీ పూజ చేస్తారు. భక్తుల మనసెరిగి, సంకల్పం చేసి, ఎవరికి ఏది కావలిస్తే దానిని ప్రసాదిస్తారు.

పైన పేర్కొన్న అయిదు రకాల శ్రీచక్రాల గురించి అతి క్లుప్తంగా చెబుతారు.:

మేరు:

ఎనిమిది దళాలు- పదహారు దళాలు- అయిదు కోణాలు. ప్రత్యామ్నాయంగా అయిదు కోణాలు పైన ఒక బిందువు. ఇదే అతి సూక్ష్మమయింది(కోణం అంటే రేఖ అని అర్థం)

భూప్రస్తారం:

రేఖ వలె వుంటుంది. త్రికోణాలతో సంధించినది. ఇది ప్రపంచపటం. నక్షత్ర మండలం- భూ మండలం - సూర్య మండలం - సమస్తమూ క్రోడీకరించిన అతి సూక్ష్మమయిన- 'శ్రీచక్రం'

మహామేరు:

బాహిరము - అంతరము కలిగినటువంటిది.

విశ్వరూపానికన్నా అతీతమయింది.

భూమికి, నక్షత్రమండలానికి, కాలానికి ప్రకృతికన్నా అతీతమయింది.

ఒక ఉద్ధరిణితో ఈ 'శ్రీచక్రం'కి నీళ్ళు పోస్తే బ్రహ్మాండానికి పోస్తున్నట్టే. భక్తులకు, స్వామీజీకి- వీరు వారు అని తేడా లేకుండా అందరికీ పోస్తున్నట్టే.

విశ్వకళ్యాణానికి ఈ 'శ్రీచక్రం' పూజ చేస్తారు స్వామీజీ నిత్యం.

అలాగే హారతి

నిత్యం స్వామిజీ అయిదు రకాల హారతులు ఇస్తారు. ఈ అయిదు హారతులు పంచ జ్ఞానేంద్రియాలకు చెందినవి. ఈ అయిదు హారతులు పంచభూతాలను సమన్వయించడానికి కూడా!

నక్షత్రహారతి - అంటే వస్తున్న నక్షత్ర మండలంతో హారతి పడుతున్నాం.
ఆకాశంలో, జలంతో, పృథ్వీతో ఈ విశ్వాన్ని ఆరాధిస్తుంటాం"

స్వామీజీ పూజ:

స్వామీజీ చేసే శ్రీచక్ర పూజకి ఒక ప్రత్యేకత వుంది.

పూజ... అంటే ఆచమనం దగ్గర్నుంచి ప్రారంభమవుతుంది కదా! నిర్ణీత వ్యవధిలో ఈ పూజా కార్యక్రమం ముగుస్తుంది. నియమిత సమయంలో తత్సంబంధమైన మంత్ర పఠనం, పూజ ముగుస్తుంది.

మంత్ర ఉచ్చారణలో నిబద్ధత వుంటుంది. ధూప, దీప, నైవేద్యాల సమర్పణలో క్రమబద్ధత వుంటుంది. ఒకరోజున స్వామీజీ ఎంతసేపటిలో పూజ ముగిస్తే రెండవ రోజున కూడా అదే సమయంలో పూజ ముగుస్తుంది.

బీజాక్షరాలు: ఒక వివరణ

ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క దేవతని, ఒక్కొక్క తత్వాన్ని సూచిస్తుంది.

ఈ అక్షరాల కూర్పు 'మంత్రం' అవుతుంది. ఈ మంత్ర ఉచ్చారణలో నిర్దిష్టత అవశ్యం.

మంత్రోపదేశం చేసే గురువు సిద్ధపురుషుడయి ఉండాలి.

మంత్రోపదేశం పొందే సమయం, స్థలం, ఆరాధనాభావం, ఆరాధనా విధానం చాలా చాలా ముఖ్యం.

అలాగే- శ్రీ చక్రంపై నున్న రేఖలు, బిందువులు, కోణాలు, శ్రీచక్రం కొలతలు అతి ప్రధానమైనవి.

"బీజాక్షరయుతం చక్రం
యతీ నా ముత్తమోత్తమం
బీజాక్షర విహీనం తు.
గృహస్థానాం ప్రశస్తకం" అన్నారు.

కనుక, భక్తుల అవసరాన్ని, తత్వాన్ని, ఆరాధని శక్తిని గ్రహించి సద్గురువు పూజకు 'శ్రీచక్రం" ప్రసాదిస్తారు.

పూజకు సమయాసమయాలు వున్నాయి.

పూజకు ఒక పద్ధతి వుంది. పూజాద్రవ్య ఎన్నికలో కూడా వివకవుంది. భకుడు

గురువు నుంచి ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాతే పూజ ప్రారంభించాలి.

పూజకు ముందు ఆ దేవతాతత్త్వాన్ని అధ్యయనం చేయాలి.

స్వామీజీ పంచామృతాలతో అభిషేకం చేయరు. ముప్పైరెండు మూలికలను కలిసి అభిషేకం చేస్తారు. అదే భక్తులకు తీర్థంగా ఇస్తారు. శ్రీచక్రం పంచలోహాలతో చిత్రిస్తారు. ఈ శ్రీచక్రం పైనున్న సాలగ్రామాలు పంచలోహాలతో తయారైన శ్రీచక్రం ముప్పైరెండు మూలికలతో తయారైన తీర్థం పడగానే చైన్ రియాక్షన్, కెమికల్ రియాక్షన్ కనిపించి - ఈ తీర్థం దివ్యౌషధంగా, జీవ సంజీవనిలా పనిచేస్తుంది.

స్వామీజీ బుద్ధిని పుష్పంగా, హృదయాన్ని పండుగా, శరీరాన్ని పత్రంగా సమర్పిస్తారు.

'లలితా సహస్రనామ స్తోత్రం' అనే మహాసౌధానికి మూలస్తంభం శ్రీచక్రార్చన. మానవ కళ్యాణానికి నిత్యం స్వామీజీ శ్రీచక్రార్చన చేస్తారు. అమ్మవారి రూపు, పసుపుకొమ్ము స్వామీజీ స్వహస్తాలతో ప్రసాదంగా అందజేస్తారు.

అమ్మవారు- మంగళకరం.

పసుపు- మంగళ చిహ్నం. పసుపుకొమ్ము ప్రక్కన కాలం విలువ వుంటుంది.

వికారాలను, దోషాలను, దుష్టశక్తులను పారద్రోలే శక్తి పసుపుకొమ్ముకి వుంది.

పసుపు కొమ్ము తాకితే ఆధ్యాత్మిక భావనలు కలుగుతాయి. శుభాలు చేకూరుతాయి. 'శ్రీచక్రం'గా పసుపుకొమ్ముని పూజించమని సలహా ఇస్తారు.

లేదా స్వామీజీ ఇచ్చే డాలరుకి పూజ చేసినా సరిపోతుంది.

ఇవి కాక రాగికడియం భక్తులకు ప్రసాదిస్తారు స్వామీజీ. పసుపు ఎంత మంగళకరమో, రాగి కూడా అంత మంగళకరము 'రాగి రాబడి కోరుతుంది' అంటారు. రాగికడియం ఆరోగ్యానికి కూడా చాలా మంచిది అని సైన్సు కూడా నిర్ధారించింది.

శ్లో॥ బిందు త్రికోణ వసుకోణ -దశారయుగ్మ
మన్వం శ్ర - నగదళ సంయుత- షోడశారం
వృత్తత్రయంచ- ధరణీ సదన త్రయంచ
శ్రీచక్ర మేతదుదితం - పరదేవతాయాః

శ్రీచక్రమందలి తొమ్మిది ఆవరణలు శరీరమందలి తొమ్మిది ద్వారములకు ప్రతీకలు. శ్రీ చక్రమే శరీరము. ప్రాణికోటికి శ్రీ చక్రమే కాదు, శ్రీదేవి తనను తానే ప్రతిష్ఠించుకొన్నది. షట్చక్రములపైన సహస్రారమున సహస్రదళపద్మమధ్యభాగమున,

బిందు రూపమున విరాజిల్లుచున్న చైతన్య స్వరూపిణి. యోగేశ్వరులు అంతరాంతరములలోని ఆనంద బిందువును చూసి, ఆనందిచటమే జీవిత పరమావధిగా నెంచుచున్నారు. భావనాశక్తితో ఆమెను ప్రసన్నం చేసుకోవాలి.

దేహోదేవాలయ -దేహమే దేవాలయము. శ్రీయాగము చేయు ప్రతి వ్యక్తికి శ్రీమాత చిన్మయాకారములో సాక్షాత్కరించును. శ్రీవిద్యకు, శ్రీచక్రానికి సన్నిహిత సంబంధము వుంది. ( శ్రీవిద్య మంత్రము బాల పంచాక్షరి, పంచదశి షోడశాక్షరి మంత్రములు సమస్త వాఙ్మయము)

1. మంత్రం 2. యంత్రములకు సంబంధించినది 3. తంత్రము

యంత్రము: శ్రీచక్రము

తంత్రము: సహస్రనామస్తోత్రము

శ్రీచక్ర బిందు స్వరూపిణి

శ్రీ లలితాపరమేశ్వర్యై నమో నమ:

శ్రీ విద్య: త్రక్షరి, పంచాక్షరి మహామంత్రములు సమస్త వాఙ్మయము.

సందేహం:

నిత్యం మీరు శ్రీ చక్రార్చన చేస్తుంటారు గదా! సూక్ష్మంగా, ఈ శ్రీచక్రమంటే ఏమిటో సెలవిస్తారా?

సమాధానం:

శ్రీచక్రం బిందు స్వరూపం. అఖండమైన శక్తికి రూపకల్పన ఈ శ్రీచక్రం. ఏ శక్తి 14 లోకాలను సృష్టిస్తుందో, ఏ శక్తి మనకు ఈ సంసార బంధాలనూ - ఈ బంధాలకు కారణమయిన శరీరాన్ని ఇచ్చిందో ఆ శివ శక్తులచే గురుపాదుకలని ఉపాసకుల సంకేతం!

నవావరణ పూజా విధానం:

నవావరణ పూజాక్రమ విధానం తెలిసిన మహర్షులే ఈ పూజ చేసేందుకు అర్హులై వున్నారు. ఓంకార సహాయంతో యోగరీతిగా ప్రకృతి దేవతలను కొలిచి, స్తుతి గావించి, ప్రసన్నులను చేయటమే ఈ పూజ ముఖ్యోద్దేశం.

ప్రకృతి దేవతలను ఒక్కొక్క నామంతో సంబోధించి, వారిని పంచేంద్రియ తత్త్వం మరియు నవద్వార తత్వాల ద్వారా ఆరాధిస్తారు. భగవతి తాల్లూకూ అద్భుత

మాయారీతుల్ని అవగాహన చేసుకోవటమే ఈ మాతృపూజా లక్ష్యం. ఈ పూజ వలన ప్రకృతి దేవతలు పోరసన్నులై, జీవకోటికి సుఖశాంతులను ప్రసాదిస్తారు. బ్రహ్మాండ పురాణంలో దేవీభాగవతంలో వివరించిన ఈ ప్రకృతి ఆరాధనను శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆచరిస్తున్నారు. లోకకళ్యాణం ధ్యేయమైన ఋషి సంప్రదాయాన్ని మానవాళికి జ్ఞప్తికి తెచ్చేందుకు స్వామీజీ ఈ నవావరణ పూజ నవరాత్రులలో జరుప సంకల్పించారు. పురాణాలు గౌరీదేవిని నవావరణంగా వివరిస్తున్నాయి. గౌరీదేవి నవరత్న శ్రీచక్ర వాసిని, బీజాక్షర స్వరూపిణి. ఈ ఆవరణము లేక కోట లోనికి ప్రవేశించేందుకు ప్రతి ఆవరణ ప్రవేశానికి  ప్రకృతి తత్వం ద్వారా తొమ్మిది ఆవరణలు:

1. వజ్ర కోట
2. వైఢూర్య కోట
3. గోమేధిక కోట
4. నీల కోట
5. ముత్యపు కోట
6. మరకత కోట
7. మాణిక్య కోట
8. కెంపు కోట
9. పుష్యరాగ కోట

ఈ తొమ్మిది ఆవరణములు ప్రయాణం చేసి, బిందు ఓంకార అక్షరంతో శ్రీస్వామీజీ లీనమై తనే తల్లి గానూ, తనయుని గానూ సంభావిస్తారు. ఆ సమయంలో మంగళహారతి ఇస్తారు. అందులోనుంచి బహిర్ముఖులైన తక్షణమే సర్వజనుల్నీ దీవిస్తారు.

ఆకాశపూజ:

ఇది ప్రథమ ప్రకృతి. ఈ ఆకాశ ప్రకృతి వజ్రకోట యందు స్థాపించబడింది. దీని పూజించడం వలన, ప్రపంచ శాంతి పరిఢవిల్లుతుంది.

పృథ్వీదేవత:

ఇది అణువు యొక్క స్వరూపం. సృష్టి స్థితి లయ తత్వములను కలిగి వున్నది. ఈ పృథ్వీదేవత వైఢూర్యకోటలో స్థాపించబడింది.

వాయుదేవత:

ఇది ప్రపంచం స్తంభించేందుకు మరియు సంచారానికి కారణామైనది. దీనిని 'వాయు స్తంభన', 'వాయు ప్రసరణ' అని వ్యవహరిస్తారు. యోగాభ్యాసం వలన దీనిని స్వాధీనపరచుకోగలం. ఇది గోమేధిక కోటలో స్థాపించబడింది.

జలదేవత:

ఈ పూజ వలన, సకాలంలో వర్షాలు కురవడం, అకాలంలో వర్షాలు నిలిచిపోవడం జరుగుతుంది. ఈ దేవత నీలకోటయందు స్థాపించబడింది.

అగ్నిదేవత:

ఈ పూజ వలన దగ్ధ శక్తి, నిగ్రహశక్తి లేక అగ్నిస్తంభన నిలుపు చేయబడుతుంది. ఇది ముత్యపు కోట యందు స్థాపితం.

మాయాదేవత:

ఈ పూజ వలన ప్రపంచ గమనం యొక్క సత్యం తెలుస్తుంది. ఇది మరకత కోట యందు స్థాపితం.

శక్తిదేవత:

ఈ దేవతను పూజించడం వలన, అపారమైన ఈ ప్రపంచశక్తిని మన స్వాధీనంలో వుంచుకుని నవరస విధానాలకు, మానవులలో మంచితనాన్ని పెంచేందుకు, బాధితులకు సహాయకారిగా ఉపయోగించవచ్చు. ఇది మాణిక్యకోటయందు స్థాపితం.

సర్వశక్తి దేవత:

'సర్వం ఈ ప్రపంచంలోనే ఇమిడి వున్నది' అనే ఏకత్వ భావనను గ్రహించడమే, ఈ పూజా భావం. ఇది కెంపుకోట యందు స్థిరమై వున్నది.

ఓంకారనాదం

ఈ ప్రపంచంలో వున్న సర్వ చరాచరములు, బిందు స్వరూపమైన ఓంకారంలో

లీనమై వున్నాయని చెప్పడం.

సందేహం:

స్వామీజీ! దసరాకి స్వామీజీ నవావరణ పూజ చేస్తారని; అందులో పాల్గొనమని, విజయవాడ గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభవారు ఒక ప్రకటన చేశారు. "నవావరణ పూజ" అంటే ఏమిటి? ఇప్పటి వరకు, మేము ఈ పూజ గురించి వినలేదు. ఈ పూజ ఎందుకు చేసుకోవాలి?

వివరణ:

శ్రీచక్రంలో 9 ఆవరణలు వున్నాయి. వీటినే చక్రాలని కూడా అంటారు. అవి వరుసగా:

1. బిందువు : దీనినే 'సర్వానందమయ చక్రము' అంటారు.
2. త్రికోణము: దీనినే 'సర్వసిద్ధిప్రద చక్రము' అంటారు.
3. అష్టకోణము: దీనినే 'సర్వరోగహర చక్రము' అంటారు.
4. అంతర్దశారము: దీనినే 'సర్వ రక్షాకర చక్రము' అంటారు.
5. బహిర్దశారము: దీనినే 'సర్వార్థ సాధన చక్రము' అంటారు.
6. చతుర్దశారము: దీనినే 'సర్వ సౌభాగ్య చక్రము' అంటారు.
7. అష్టదళ పదం: దీనినే 'సర్వ సంక్షోభిణీ చక్రము' అంటారు.
8. షోడశ దళపత్రము: దీనినే 'సర్వాశా పరిపూరక చక్రము' అంటారు.
9. భూపురము: దీనినే 'త్రైలోక్య మోహన చక్రము' అంటారు.

సందేహం:

సువాసిని పూజ అంటే ఏమిటి?

సమాధానం:

పూర్వం మన ఋషులు ప్రకృతి పూజలు చేసేవారు. ఈ పూజలను ఈ కాలంవారు మర్చిపోయారు. కుంకుమ పూజలకు, హోమాలకు, అభిషేకాలకు పరిమిత మవుతున్నారు.

ఇప్పుడు స్వామీజీ ఆ ఋషి సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. ఆ పూజల ఫలితాన్ని తన భక్తులకు ధారపోయడానికి, విశ్వశ్రేయస్సుకి స్వామీజీ ఈ పూజలు

చేస్తున్నారు. తన భక్తుల చేత చేయిస్తారు.

మహాసాధ్వి 'అగస్త్యుని ధర్మపత్ని' లోపాముద్ర సువాసిని పూజచేసి అమ్మవారి కృపకు పాత్రమయింది. మహిళలు చేసుకునే పూజ ఇది.

"సువాసిన్యర్చన ప్రీతా" అని అమ్మవారిని స్తుతిస్తారు. సువాసినుల పూజలు అందుకోవడం, ఆ అమ్మకు ఇష్టం అని మనం గ్రహించాలి. స్వామీజీ ఆశ్రమంలో జరిగే వినాయక చవితి, శివరాత్రి, దసరా, దత్తజయంతి, స్వామీజీ జన్మదిన వేడుకలు చూస్తే స్వామీజీ ఋషి సంప్రదాయకంగా చేసే పూజలు అర్థమవుతాయి.

మహిళలు తమ సౌభాగ్యానికి, తమ పిల్లల సౌభాగ్యానికి చేసుకునే పూజ ఈ సువాసిని పూజ.

సందేహం:

స్వామీజీ! నవరాత్రి సందర్భంగా శ్రీస్వామీజీ సువాసిని పూజ చేస్తారని తెలిసింది. ఏ ప్రయోజనాన్ని ఆశించి సువాసినిపూజ చేస్తారు ఆ పూజల విధానం ఏమిటి? సవివరంగా తెలుపగలరు.

సమాధానం:

సువాసిని అంటే ముత్తైదువ స్త్రీ

నవరాత్రులలో మనం తల్లిపూజ కదా చేస్తున్నాం! ఆ తల్లిని కన్యగా, ముత్తైదువగా అర్చన చేయటం ఋషి సంప్రదాయం. ఇవే కన్యాపూజ, సువాసిని పూజలు. ఒక ఏటి నుంచీ 16 ఏళ్ళ వరకు గల కన్యలను వరుసగా కూర్చోబెట్టి, శ్రీమాత రూపంగా అర్చించటం కన్యార్చన, వివాహమైన స్త్రీలను కూర్చుండబెట్టి, శ్రీమాత ప్రతిరూపంగా భావిస్తూ అర్చన చేయటం సువాసినీ పూజ, పూజా విధానంలో విశేషం లేదు. అది మామూలు పూజా విధానమే. చేసే భావనలోనే విశేషం వుంది.

శ్రీదేవీ ఉపాసన చేసేవారు ప్రపంచంలోని స్త్రీలందరను అమ్మవార్లుగానే భావించాలి. దీనికి సంకేతంగానే నవరాత్రులలో కన్యాపూజ, సువాసినీ పూజలు ఏర్పడ్డాయి.

నవరాత్రులన్నీ ఏ ప్రయోజనం కోసం చేస్తారో- వాటికి అంగాలయిన ఈ సువాసినీ పూజలు కూడా అందుకోసమే చేస్తారు. వీటికి ప్రత్యేకంగా వేరే ఆశ వుండదు.

మానవులందరి క్షేమం కోసమే స్వామీజీ నవరాత్రి ఉత్సవాలను ఆదరిస్తున్నారు. ముఖ్యంగా, ఆదిశక్తి కృప అందరిపై ప్రసరించాలనేదే స్వామీజీ ఆశ.

సందేహం:

నవరాత్రికి ముందు పాడ్యమి రోజున శ్రీ స్వామీజీ, ఋత్విక్కులు దీక్షాకంకణం చేస్తారని విన్నాము. ఋత్విక్కులంటే ఎవరు? దీక్షా కంకణం అంటే ఏమిటి?

సమాధానం:

ఎవరికి వారు ఇంట్లో చేసుకునే పూజ చిన్న పూజ. దీన్నే 'లఘు కల్పం' అంటారు. పూజ విస్తారమైనప్పుడు పూజలోని కార్యక్రమాలన్నీ ఒకే వ్యక్తి నిర్వహించడం సాధ్యం కాదు. ముఖ్యంగా, సామాజిక ప్రయోజనాలను ఉద్దేశించి గుడులు, ఆశ్రమాలు వంటి స్థలాలలో విస్తారమైన పూజలు, హోమాలు చేసేటప్పుడు ఒకడు కర్తగాను, అతనికి మరికొందరు సహాయకులుగాను ఉండి పని చేయవలసి వుంటుంది. ఇలాంటి సహాయకులను 'ఋత్విక్కులు' అంటారు. ఉదాహరణకు: దేవీ నవరాత్రులే తీసుకుందాము. ఈ కల్పంలో ప్రధాన దేవతకు చేసే నవావరణా అర్చన ప్రధానమైనది. దీనికి బలం చేకూర్చేందుకోసం సప్తశ్శతి, మహావిద్య వంటి పారాయణాలు, మహామంత్రహోమాలు, జపాలు చేయవలసి వుంటుంది. అన్నీ ఒకే వ్యక్తి చేయటం సాధ్యం కాదు. అందుకోసం, ప్రధాన కర్త దక్షిణ ఇచ్చి, సహాయకులను తీసుకుంటాడు. వీరే ఋత్విక్కులు. మహాత్ముల సన్నిధానంలో మరో విశేషం జరుగుతూ వుంటుంది. మహాత్ములు చేసే అర్చనలలో లేదా యజ్ఞంలో సహాయకులుగా చేరినట్లైతే, అది సహాయకుడికి విపస్త్రస అధ్యాత్మిక శక్తిని యిస్తుంది. ఎందుకంటే, మహాత్ములు తమ స్వార్థం కోసం పూజలు చేయరు. లోకహితం కోసం తమ ఏకాగ్రతను మొత్తం వెచ్చించి, వారు అర్చనలు చేస్తారు. అలాంటి శక్తివంతమైన సన్నివేశంలో, సహాయకుడిగా చేరినవాడు ప్రవాహానికి వాలుగా పడవ ప్రయాణం చేసినట్లు అవుతుంది. అందువల్ల, అతడి ఆధ్యాత్మిక ప్రగతి పెద్ద ముందడుగు వేస్తుంది.

అయితే ఎవరు క్రతువు చేసినా, ఋత్విక్కును ఎన్నుకోవడంలో మాత్రం తగిన జాగ్రత్తను వహించడం అవసరం. శాస్త్రాలలో చెప్పిన అర్హతలు లేని వారిని ఋత్విక్కులుగా పెట్టుకొన్నట్లైతే, ఇంజనీర్లతో వైద్య శస్త్ర చికిత్సలు చేయించినట్లు వుంటుంది.

ఇక ప్రధానుడైన యజమాని, సహాయకులైన ఋత్విక్కులు కూడా తాము చేయబోయే కార్యక్రమమేమిటో, అది ఎన్ని రోజుల కార్యక్రమమో, అందులో ఎవరి విధి

ఏమిటో నిర్ణయించుకుని ఆ విధంగా చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. దీనిపేరే దీక్ష. దీనికి చిహ్నంగా, కుడిచేతికి ఒక కంకణం ధరిస్తారు. ఈ కంకణం బంగారము, రాగి వంటి లోహాలతో చేసినది కావొచ్చు లేదా పసుపు ధారము, మామిడాకులతో చేసినది కావొచ్చు. ఆ కంకణం ధరించిన దగ్గరనుంచి, వాళ్ళు దీక్షగా నిర్ణయించుకున్నరోజుల వరకు, ఋత్విక్కులు ప్రత్యేక నియమాలను పాటించవలసి వుంటుంది. వారు ధరించిన కంకణం, వారి దీక్షను అనుక్షణం గుర్తుచేస్తూ వుంటుంది. ఇదే దీక్షా కంకణం.

దేవీభవ్య భవనం - భగవతి దివ్య మందిర ప్రవేశ విధానం

మణిద్వీపం

నిత్యం శ్రీ చక్రార్చన, గణపతి హోమం తలపెట్టేది శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మాత్రమే. 'దత్తాత్రేయుని అవతారమే, ఈ గణపతి సచ్చిదానంద స్వామీజీ' అని భక్తులు విశ్వసించే శ్రీ స్వామీజీ, ఒక పాఠకుడు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం:

మణిద్వీపకళ్యాణ్యై నమః। మీనాక్ష్యై నమః। ఈశ్వర విలాశిన్యై నమః। కలికాయై నమః। హ్రీంకారేశ్వర్యై నమః హంస గామిన్యై నమః। సర్వజ్ఞాయై నమః। కమలాక్ష్యై నమః। హరిద్రాకుంకుమారాధ్యాయై నమః। లక్ష్మీవాణీస్తుతాయై నమః। హ్రీంశీలాయై నమః। సంపత్ కర్యై నమః। కామితార్థ ప్రదాయిన్యై నమః। సకారాయై నమః। హ్రీం నమః। శ్రీం నమః।

అమ్మవారి దివ్య మందిర ప్రవేశానికి సరైన భక్తి, శ్రద్ధ, యోగ్యత, గురూపదేశం, సాధన, సాధుజీవనం అవసరం. కోటిలో ఒకరికే, ఈ దివ్య భవన ప్రవేశం లభిస్తుంది. ఈ దివ్య మందిర ప్రవేశ విధానం వినడం వల్లనే, గత జన్మల పాపం నాశన మవుతుంది. సద్గురు కృప కలుగుతుంది.

ఈ భవనం యొక్క విశేషం విన్నవారికి, వినిపించినవారికి అనేక జన్మల ఫలం అయిన దేవి అనుగ్రహం, సద్గురు ఆశీర్వాదం లభిస్తాయి.

దేవీ అమ్మవారి దివ్య భవన ప్రవేశం చేయగల యోగ్యత వున్నవారు రావడం: అక్కడ పరిచారిక "సెకీరు" అనుమతి అడగటం, ఆ సెకీరు వచ్చిన వారికి యోగ్యత వున్నదా లేదా అనేది విచారించడం, పరీక్షించడం, యోగ్యత వుంటే ముందుకి పంపబడతారు. లేకుంటే అచ్చటి నుంచే వెనుకకు తిరిగి పంపబడతారు.

అట్లా యోగ్యత వున్నవారు అనుమతి తీసుకుని పశ్చిమానికి, మరలా ఉత్తరానికి వెళ్ళి, మరల పశ్చిమానికి వస్తే, అక్కడ పశ్చిమం నుండి చిన్న త్రోవ కనిపిస్తుంది. ఆ త్రోవలో వెళ్లితే, ఉత్తరానికి తిరగడం కనిపిస్తుంది. అక్కడినుండి మరల పశ్చిమానికి తిరుగుతూ వుంటే, అక్కడ రెండు త్రోవలు కనిపిస్తాయి. ఒకటి పశ్చిమ దిక్కుకు కనిపిస్తాయి. ఇక్కడ పూర్వదిశకు వెళ్ళదామా, పశ్చిమ దిశకు వెళ్ళదామా అనే జిజ్ఞాస కలుగుతుంది. అక్కడ అష్ట వసువులు వుంటారు. వాళ్ళను అడిగినా ప్రయోజనం వుండదు. ఎందుకంటే, వాళ్ళు పలకరు. అప్పుడు, పశ్చిమానికి వెళ్లటం మంచిది అని అనిపిస్తుంది. కాని, అటు వెళ్లినా వాళ్ళు అక్కడే వుంటారు. మరలా తిరిగి రావటానికి వీలు కాదు. అక్కడినుండి పోవడానికి దారిలేదు, అంతే.

ఇందువలన పూర్వ దిక్కుకు వెళ్ళాలి. అక్కడ ఒక మహా ద్వారం ఉంటుంది. అక్కడ ఒక పుష్కరిణి వుంటుంది. ఆ పుష్కరిణిలో స్నానం చేయాలి. అక్కడ ఎప్పుడు అయితే స్నానం చేస్తామో, అప్పుడే జ్ఞానోదయం అవుతుంది. అక్కడి నుండి ఉత్తర దిశకు వెళ్ళాలి. ఉత్తర దిశకు వెళ్ళి, మరలా పూర్వ దిక్కుకు వెళ్ళాలి. అక్కడ మళ్ళీ రెండు త్రోవలు కనిపిస్తాయి. ఒకటి ఉత్తరానికి, ఒకటి దక్షిణానికి వెళతాయి. అక్కడ ఏకాదశ రుద్రులు వుంటారు.

అక్కడ ఏకాదశ రుద్రులను అడిగినా ఏమీ ప్రయోజనం లేదు. వాళ్ళు ఉలకరు, పలకరు, మన కర్మానుసారమైన బుద్ధితో, మంచి బుద్ధి పుడుతుంది. అక్కడ ఉత్తర దిక్కుకు వెళ్లితే నక్షత్ర మండలం, నక్షత్రలోకం దొరుకుతాయి. దక్షిణ దిశకు వెళితే, చిన్న సోపానం కనిపిస్తుంది. దానికి 16మెట్లు కనబడతాయి. ఆ మెట్లను చిన్నగా ఎక్కుతూ వెళ్లిన అక్కడ ఒక వృత్తాకారమైన త్రోవ కనిపిస్తుంది. ఆ మహాద్వారం దగ్గర కూడా, రెండు త్రోవలు కనిపిస్తాయి. అవి కూడా ఒకటి పశ్చిమానికి ఉంటాయి. పూర్వానికి వెళితే ఒక విశాలమైన స్వర్ణభవనం లభిస్తుంది. సుందరమైన ఆ భవనంలో అతి సుందరమైన విగ్రహాలు కనిపిస్తాయి. అంటే, సుందరమైన మాయను చూపిస్తుంది. అది మనకు చాలా అద్భుతంగా కనిపిస్తుంది. దానిని చూస్తూ, అక్కడే వుండిపోయేవాళ్ళు చాలా మంది వుంటారు. అంటే, ఇక్కడ అష్టసిద్ధులనూ జయించాలి లేదా అక్కడే చూస్తూ నిలబడతారు.

అందుకే అక్కడి నుండి ముందుకి వెళ్ళటానికి ఉత్తమమైన ప్రార్థన చెయ్యాలి. వాళ్ళు ముందుకు వెళ్ళే అంతటి యోగ్యులు అయితే, వాళ్ళకు ద్వాదశాదిత్యులు కనిపిస్తారు. వాళ్ళు ముందుకు త్రోవ చూపుతారు. అక్కడినుండి పశ్చిమ దిశకు వెళితే,

అక్కడ ఒక పెద్ద సోపానం కనిపిస్తుంది. ఇదొక పెద్ద మెట్లదారి అన్నమాట. దానిని ఎక్కడం చాలా కష్టం. శ్రమపడి ఎక్కితే, నీలాకాశమైన, చాలా విశాలమైన, ఒక చక్రద్వారమైన వస్తువు కనిపిస్తుంది. దానిని చూసి భ్రమపడతారు. అయినా, దానిని దాటితే ఒకే ఒక సోపానం కనిపిస్తుంది. అది ఎక్కితే మరలా ఒక వృత్తాకారమైన రెండు దారులు కనిపిస్తాయి. అక్కడి నుండి నైరుతికి వెళ్ళాలి. అక్కడ రెండు దారులు కనిపిస్తాయి. ఒకటి ఉత్తరానికి, రెండవది దక్షిణానికి వెళతాయి. దక్షిణానికి వెళ్లేదారి అత్యద్భుతమైంది. అతి సుందరమైనది. అక్కడ 'భువనసుందరి' అనే శక్తి వుంటుంది. అక్కడికి ఎవరు వెళ్ళుచున్నారో, వారు ఆమె మాయకు చిక్కి, అక్కడి నుండి ఇంకా ఎక్కడికీ వెళ్ళలేరు. అక్కడే వుండిపోతారు. ఒక స్త్రీగాని, ఒక పురుషుడు గాని ఆ మాయాశక్తికి లోనయిపోతున్నారు అంటే, ఆ భువన సుందరీ మాయకు లోను అవుతున్నారన్నమాట. అయినా ఆ మాయను గెలిచి ఉత్తరానికి వెళితే, అక్కడ చతుర్ముఖ బ్రహ్మలు వుంటారు. అమ్మవారిని గెలిచి వెళ్ళితే చతుర్ముఖ బ్రహ్మలను చేరుతాము అన్నమాట. వీరి అనుమతి తీసుకుని ముందుకు సాగాలి. దానికి శ్రద్ధా, భక్తీ గురుకృపా వుండాలి. అక్కడ మన భక్తి చాలా భాగం వుంటే, ముందుకు వెళ్ళటానికి సోపానం కనిపిస్తుంది. అంటే, మళ్ళీ మెట్లు కనపడతాయి. ఆ మెట్లను ఎక్కనవసరం లేదు. అవే ముందుకు తీసుకుపోతాయి అక్కడికి.

సందేహం:

'నవరాత్రు'లంటారు. ఇందులో '9' ప్రస్తావన ప్రత్యేకత ఏమిటి?

సమాధానం:

ఈ ప్రపంచం యొక్క సృష్టి అంతా నిర్గుణ పరబ్రహ్మలోంచే సంభవిస్తోందని, సమస్త వేద, పురాణాలు నిర్వచిస్తున్నాయి. అయితే, నిర్గుణ పరబ్రహ్మ నిర్వికారమైనది. ఏ మార్పులూ లేని పరబ్రహ్మలోంచి, ఇన్ని మార్పులు వున్న ప్రపంచం ఎలా ఉత్పన్నమవుతోంది? అదెలా సంభవం? అని ప్రశ్న కలగటం సహజం.

శ్రీ శంకరాచార్యులవారు సౌందర్యలహరిలో:

శివ: శక్త్యాయుక్తోయది భవతి శక్త: ప్రభవితుం
నచే దేవం దేవో నఖలు కుశల స్పందితు మపి।
అతస్త్వా మారాధ్యాం హరిహర విరించాది భిరపి
ప్రణంతుం స్తోతుంవా కథ మకృత పుణ్య: ప్రభవతి॥

అన్నారు.

శక్తితో వున్నప్పుడే శివుడు ( పరమాత్మ) సృష్టి చేయటానికి సమర్థుడవుతాడు. శక్తితో కలిసి లేకపోతే ఆయన కదలటానికి కూడా సమర్థుడు కాదు. అందువల్లనే హరి, హర బ్రహ్మాదులంతా ఆ శక్తినే ఆరాధిస్తూ వుంటారు. 'అట్టి ఆ శక్తికి నమస్కరించాలన్నా లేదా స్తోత్రం చేయాలన్నా, పుణ్యం లేని వారికి సాధ్యం కాదు' అని పై శ్లోకానికి భావం.

ఇది శంకరాచార్యులవారి సౌందర్యలహరిలో మొదటి శ్లోకం. వారి సిద్ధాంతాలకు ఇది సమన్వయ శ్లోకం.

ఈ శ్లోకాన్ని ఇలా వుంచి మనం మరో వైపు నుంచి చూద్దాం.

ప్రపంచంలో ఏదైనా కదలిక వుందంటే, దాని వెనకాల ఏదో శక్తి వున్నట్లు ఖాయమే కదా! కదలిక అంటే, భౌతికమైన కదలిక మాత్రమే కాదు. మానసిక చలనం గూడా కదలికే. అందుకనే మన పురాణాలలో శక్తి మూడు రకాలు అన్నారు:

1) ఇచ్ఛాశక్తి
2) జ్ఞానశక్తి
3) క్రియాశక్తి

ఏదైనా పని జరగాలంటే, ముందు ఆ పని చేయ్యాలనే కోరిక (ఇచ్ఛ) పుట్టాలి. ఇదే ఇచ్ఛాశక్తి , కోరిక కలిగినాక, ఆ పనియెలా చెయ్యాలో, ఆ జ్ఞానం కలగాలి. ఇదే జ్ఞానశక్తి. ఇచ్ఛ, జ్ఞానం రెండూ వున్నాక -సరాసరి పని జరగాలి. ఇదే క్రియాశక్తి.

ఒకడికి కుండలు చెయ్యాలనే సంకల్పం కలిగింది. ఇది ఇచ్ఛాశక్తి వల్ల కలుగుతోంది. మట్టి తెస్తే దానితో కుండలు చేయవచ్చు అని అతనికి తెలిసింది. ఇది జ్ఞానశక్తి, ఇక చక్రం మీద మట్టిముద్ద పెట్టి, దాన్ని జాగ్రత్తగా కుండగా రూపొందించాడు. ఇది క్రియాశక్తి.

ఈ ప్రపంచం మొత్తం ఒక కుండగా భావించండి. దీన్ని సృష్టించే సృష్టికర్త వుంటాడు కదా! అతనయినా 'సృష్టి' అనే స్పందనను పొందాలంటే- ఈ మూడు శక్తుల యొక్క సమావేశం తప్పదు.

అంటే తేలిందేమంటే, సృష్టి మొత్తం గూడా ఈ మూడు శక్తుల యొక్క విపరిణామమే తప్ప మరొకటి కాదు. అందువల్లనే, ఈ ప్రపంచంలోని ప్రతి అణువులోనూ, నిరంతర చలనశీలమైన శక్తి యొక్క అపార రాశిని మనం దర్శించగలుగుతున్నాయి.

ఈరోజు విజ్ఞాన శాస్త్రం వృద్ధి చెంది, ప్రపంచంలో పదార్థమనేది శక్తి యొక్క రూపాంతరమే అని నిరూపించింది. పదార్థంలోని ప్రతి అణువును $E=MC^2$

అనే సూత్రం ప్రకారంగా శక్తిగా పరివర్తింప చేయవచ్చునని విజ్ఞానశాస్త్రం ఈనాడు నిరూపించుతోంది. ఏ అణువును పగులకొటి చూచినా, అందులో అపారశక్తే దర్శనమిస్తుంది అని గూడా ఈనాడు విజ్ఞానశాస్త్రం మనకు నిరూపిస్తోంది.

మనకు విజ్ఞానశాస్త్రం ద్వారా కనిపించేదంతా క్రియాశక్తి యొక్క రూపాంతరం. దీని వెనకాల జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తులనేవి వున్నాయని మనం తేలికగానే ఊహించగలం.

ఈ మూడూ కలసిన సంపూర్ణశక్తినే మనవారు పరాశక్తి అని. ప్రకృతి అని, అవ్యక్తమని, శుద్ధ మాయ అని అనేక పేర్లు పెట్టారు.

వీటిలో ప్రకృతి అనే ఎక్కువ ప్రసిద్ధమైనది. ప్రకృతి అంటే ప్రకృతి. కృతి అంటే క్రియా శక్తి. ప్రకృతి అంటే గొప్ప కృతి. అంటే సృష్టి మాత్రమే గాక స్థితిని, సంహారాన్ని కూడా చేసే శక్తి అని అర్థం. భగవద్గీతలో గూడా ఈ ప్రకృతి తత్వాన్ని గూర్చి విపులంగా చర్చించబడి వుంది.

ఇంతకూ, కుండలను కుమ్మరివాడు చేస్తున్నాడనుకుంటే, వాడిలో వున్న ఇచ్ఛా జ్ఞానక్రియా శక్తులు చేస్తున్నాయా అని ప్రశ్నవస్తే - శక్తులే చేస్తున్నాయనేది తర్కసహజమైన సమాధానం. ఎందుకంటే, కుమ్మరివాడు నిరంతరంగా కుండలను చేసి పోస్తూ వుండడు. వాడిలో ఇచ్ఛా జ్ఞాన శక్తులు ప్రకోపించినప్పుడు మాత్రమే, క్రియాశక్తి ద్వారా కుండలు ఆవిర్భవిస్తూ ఉంటాయి.

ఇదే సూత్రం యావత్ప్రపంచానికి జన్మనిచ్చింది. ఇచ్ఛా జ్ఞాన క్రియలనే మూడు శక్తులూ కలసి, పరాశక్తియే గాని మరొకరు కాదు. అందువల్లే, ఈ జగత్తు మొత్తానికి పరాశక్తియే తల్లి అని శాస్త్రాలు నిర్ణయించినాయి.

సాక్షాత్తుగా జన్మనిచ్చేది తల్లేగాని తండ్రికాదు. అందువల్లే, శక్తిని జగన్మాతగా దర్శించారు మన మహర్షులు.

అందువల్లనే, శంకరాచార్యులవారు "శివశ్శక్త్యాయుక్తోయది భవతి శక్త: ప్రభవితుం" అనే శ్లోకంలో, ఆ శక్తిని హరి హర బ్రహ్మాదులంతా ఆరాధన చేస్తున్నారు అని చెప్పారు.

ఆమెను తల్లిగా ఉపాసిస్తున్నాం కనుక, ఆమె కరుణ మనమీద ప్రసరించటం సహజం. యద్భావం -తద్భవతి కదా!

ఆ తల్లి, శక్తి మాత, ఈ సృష్టినే గాక, స్థితి సంహారాలను కూడా తనే చేస్తోంది.

కుమ్మరివానిలోని ఇచ్ఛా, జ్ఞాన శక్తులు కుండలనే క్రియను పుట్టిస్తున్నాయి.

కంసాలిలోని ఇచ్ఛా, జ్ఞాన శక్తులు నగలనే క్రియను పుట్టిస్తున్నాయి. అదే

రీతిగా, బ్రహ్మలో ఆ పరాశక్తి సృష్టిని కలిగిస్తోంది. విష్ణువులో అదే పరాశక్తి స్థితిని కలిగిస్తోంది. రుద్రుడిలో అదే పరాశక్తి సంహారాన్ని కలిగిస్తోంది. అందుకే, ఆ ముగ్గురూ గూడా ఆ శక్తి మాతనే ఆరాధిస్తున్నారు. అందుకే మనం కూడా ఆ తల్లినే ఆరాధిస్తున్నాము. అయితే, మనం శుద్ధ స్వరూపంలో శక్తి మాతను దర్శించలేము. ఊహించనైనా లేము. అందుకోసమే శక్తిమాత తన మొదటి రూపంగా శ్రీచక్రాన్ని నిర్మించింది. ఆ పైన వివిధ దేవీ రూపాలను స్వీకరించి మన ఉపాసనకు సౌలభ్యం కల్పించింది.

ఈ విధానాలలోనే నవరాత్రి ఉత్సవా లొకటి. ఈ ఉత్సవాలలో శక్తిమాతను 9 రూపాలుగా అర్చన చేస్తాం మనం. తొమ్మిదిగానే ఎందుకు?

నిజానికి శక్తి యొక్క రూపాలు అనంత రీతులు. ఈనాటి సైన్స్ గూడా శక్తి అనంత విధాలుగా వుందని అంగీకరిస్తోంది కదా! అనంతరీతులకు సంకేతం 9. ఎందుకంటే, తొమ్మిది తరువాత అంకెలు మళ్ళీ పునరావృత్తమవుతాయి. అందుచేత 9, అంకెలలో పరాకాష్ఠకు సంకేతం. అందుకే నవదుర్గా రూపిణిగా అమ్మను మనం అర్చిస్తున్నాం. అంటే, ప్రపంచంలో మనం ఊహించను గూడా లేనన్ని వివిధ రూపాలలో వున్న శక్తిని మనం ఆరాధిస్తున్నామన్నమాట.

నవరాత్రి ఆరాధనలో ఉన్న శక్తిత్వం ఇదే!